## మున్నుడి

"ఇప్పుడిటుకలగంటి" అని ఆదిలో అన్నమాచార్యులవారు తన కలలో వేంకటేశ్వరుని, దివ్యతిరుమలక్షేత్రాన్ని కలగన్నానని అద్భుతమైన కీర్తన వినిపించారు. ఇప్పుడు ఆచార్యులవారు ప్రత్యక్షంగా కనులముందు దివ్యతిరుమల క్షేత్రాన్ని చూచి తన్మయులై ఆ భావావేశంలో ఈ అమృతసాన్నం చేయిస్తున్నారు. బృందావని రాగంలోని ఈ కీర్తన నెన్నిసార్లు వినినా తనివి తీరదు. ఈ కీర్తనకు 'మున్నుడి' వ్రాస్తున్నప్పుడు నాకు కలిగిన ఆనందం కూడా వర్ణించలేను. అన్ని పనులు అందరూ చేయలేరు. చేయాలంటే శ్రీహరినే శరణు అనవలసిందే....

**మ॥ "కనుగొంటిన్ అఖిలాండకోటులకు తాగర్తౌ మహాస్వామినిన్**
**అనఘున్ జూచితి పాపరాశి తొలగెన్ "అన్నయ్య వాక్రుచ్చెరా**
**వినిపించెన్ మహనీయ కీర్తనము శ్రీక్షేత్రంబు గీర్తించుచున్**
**గొనినే 'మున్నుడి'వ్రాసి ధన్యుడయితిన్కొల్తున్సదా శ్రీహరిన్.**

**రాగం : బృందావని**

కంటి అఖిలాండ కర్తనధికుని గంటి
కంటి నఘములు వీడుకొంటి నిజమూర్తి గంటి ॥కంటి॥

మహనీయ ఘనఫణామణులశైలము గంటి
బహువిభవముల మంటపములు గంటి
సహజ నవరత్న కాంచన వేదికలు గంటి
రహివహించిన గోపురంబులవె కంటి ॥కంటి॥

పావనంబైన పాపవినాశనము గంటి
కైవశంబగు గగనగంగ గంటి
దైవికపు పుణ్యతీర్థములెల్ల పొడగంటి
కోవిదులు కొనియాడు కోనేరు గంటి ॥కంటి॥

పరమయోగీంద్రులకు భావగోచరమైన
సరిలేని పాదాంబుజములు గంటి
తిరమైన గిరిచూపు దివ్యహస్తము గంటి
తిరువేంకటాచలాధిపు చూడగంటి ॥కంటి॥

**భావామృతం :**

అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడైన స్వామిని, వాటి కర్త మరియు అధినాయకుడైన మహానుభావుని చూచితిని. నా పాపరాశులనెల్ల తొలగించుకొంటిని. ప్రత్యక్షముగా కనుల ముందు కనివించు మూర్తిని గాంచితిని.

మహానీయమైన గొప్ప పడగలు కలిగిన ఆదిశేషుని పర్వతము శేషాచలమును కనుగొంటిని. అక్కడున్న అనేక రకములైన వైభవములతో సహజముగా నేర్పడిన నవరత్న శోభితమైన బంగారు వేదికలను కనులార గాంచితిని. ఎంతో ఒప్పు అయిన (రహివహించిన), గోపురములనుచూచితిని.

పవిత్రమైన 'పాపనాశనము' అను దివ్యక్షేత్రమును దర్శించితిని. ఎట్లో చేరుకొని సాధించి ఆకాశగంగను దర్శించి (స్నానమాడి) తరించితిని. దైవికంగా అదృష్టవశమున ఎన్నో దివ్యపుణ్య క్షేత్రములను సందర్శించితిని. మహాపండితుల చేత కీర్తించబడునట్టి కోనేటిని చూచితిని.

దివ్యులైన యోగీంద్రులు తమ భావనలలో మాత్రమే సందర్శించగల అద్వితీయమైన పాదపద్మములను జూచితిని. ఇదిగో ఈ తిరుమలను దర్శించండి చరితార్థులవండి అని చూపుతున్న పావనమైన 'హస్తమును' చూచితిని. ఆ విధముగా వాటన్నింటికి అధినాథుడైన శ్రీవేంకటేశ్వరుని దర్శించితిని.